క్లుప్తంగా

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళనలు



ఏలేశ్వరంలో ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపో కండక్టర్‌ను అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ పట్టణంలో ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న ధర్నాలు శనివారం కొనసాగాయి. జేఏసీ ఆధ్వర్యంలో డిపో గేట్ వద్ద ఉద్యోగులు ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ డిపో కండక్టర్ ఎస్వీ రమణను 1/2009 సర్కులర్‌కు విరుద్ధంగా సస్పెండ్ చేశారన్నారు. ఉద్యోగులు ధర్నాలు చేస్తున్న యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. కండక్టర్‌ను విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంయూ డిపో కార్యదర్శి టి.త్రిమూర్తులు, ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి యూబీఎం కుమార్, యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎన్పీరావు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా నిలవాలి

తుని రూరల్: నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు బిల్డింగ్ వర్కర్ల సంక్షేమ బోర్డు ఆసరాగా నిలవాలని ఏపీ భవన, నిర్మాణ కార్మికుల సంఘం తుని ఏరియా నాయకుడు నక్కెళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం తుని మండలం తేటగుంట గ్రామంలో సంఘ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్మాణ రంగం సంక్షేమాన్ని నిలిపివేసిందని ఆరోపించి కూటమి నాయకులు ఓట్లు వేయించుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినా నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమాన్ని, బాగోగులను పట్టించుకోలేదని ఆరోపించారు. నిత్యం నిర్మాణ రంగంలో ప్రమాదాలతో మృత్యువాత, అనారోగ్యం పాలవుతున్న కార్మికుల సంఖ్య పెరుగుతోందన్నారు. సంక్షేమ బోర్డు నిధుల నుంచి చనిపోయిన కార్మిక కుటుంబాలకు ఆర్థిక సాయం చేసేందుకు కూటమి నాయకులకు ఖాళీలేదా ? అని ప్రశ్నించారు. వెంటనే సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, బాధిత కుటుంబాలకు ఆర్థిక చేయూత ఇవ్వాలని కోరారు. సంఘం సభ్యులు దొరబాబు, ఈశ్వరరావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

95 శాతం పింఛన్ల పంపిణీ

తుని రూరల్: మండలంలో 95 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ కె.సాయి నవీన్ శనివారం తెలిపారు. అత్యధికంగా చామవరంలో 97.78 శాతం, అత్యల్పంగా వల్లూరులో 88.53 శాతం మందికి పింఛన్లు అందజేశామన్నారు. మండలంలో 27 సచివాలయాల పరిధిలో 12133 మంది పింఛన్‌దారులు ఉండగా 11450 మందికి ఇళ్ల వద్ద పింఛన్లు ఇచ్చి జిల్లాలో ఏడో స్థానంలో నిలిచామన్నారు.
గండేపల్లి: మండలంలోని శనివారం తొలిరోజు 94 శాతం మందికి పెన్షన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. మొత్తం 8341 మంది లబ్ధిదారులకు గాను 7833 మందికి పంపిణీ చేసినట్టు వివరించారు. పెన్షన్ పంపిణీని కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించినట్టు చెప్పారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



భూపాలపట్నంలో చెత్త సేకరిస్తున్న సిబ్బంది

కిర్లంపూడి: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఈవోపీఆర్డీ సత్యప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లో ప్రతి శని, ఆదివారాలు పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. గ్రామల్లో రోడ్డు పక్కన చెత్త కుప్పలు, పశువుల పెంటను సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తున్నామన్నారు. శనివారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోని పారిశుధ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తల సేకరణకు డస్ట్‌బిన్లు పంపిణీ చేశారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి



ఎ.కొత్తపల్లిలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్పీవో బాలామణి

తొండంగి: పంచాయతీల్లో నిర్వహిస్తున్న చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలని డీఎల్పీవో ఎం.బాలామణి సూచించారు. మండలంలోని ఎ.కొత్తపల్లి, తొండంగి, గోపాలపట్నం తదితర గ్రామాల్లో శనివారం నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను పరిశీలించారు. తడి, పొడి చెత్తల సేకరణ, డంపింగ్ తదితర అంశాలపై ఆరా తీసారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.



తునిలో ఇంటర్ పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



గోకవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థుల సందడి



శంఖవరం ఆదర్శ పాఠశాల్లో పరీక్షలకు హాజరైన విద్యార్థులు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- తొలిరోజు 36 మంది గైర్హాజరు
- పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత



ఏలేశ్వరంలో పరీక్ష కేంద్రం వద్ద హాల్ టిక్కెట్ల నంబర్లు చూస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు నియోజకవర్గవ్యాప్తంగా శనివారం ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో విద్యార్థులు స్వేచ్ఛగా పరీక్షలు రాశారు. పరీక్షలకు 740 మంది విద్యార్థులకు గాను 36 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కాగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్ష కేంద్రాలైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 365 విద్యార్థులకు గాను 353 మంది, గురుకుల కళాశాలలో 375 మంది విద్యార్థులకు గాను 350 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఇన్విజిలేటర్లు జంబ్లింగ్ విధానంలో విధులకు హాజరయ్యారు. పరీక్షల నిమిత్తం గురుకుల కళాశాలకు చీఫ్ సూపరింటిండెంట్‌గా కె.శారద, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా కె.సత్యనారాయణ, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చీఫ్ సూపరింటిండెంట్‌గా కె.బాబ్జీ, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా పి.రామకృష్ణ వ్యవహరించారు.

కిర్లంపూడిలో 33 మంది గైర్హాజరు

కిర్లంపూడి: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ముగిశాయి. కిర్లంపూడి ప్రభుత్వ, జగపతినగరం ప్రగతి ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఫస్టియర్ తెలుగు, సంస్కృతం పరీక్షలకు 933 మంది హాజరు కావాల్సి ఉండగా 900 మంది హాజరయ్యారు. 33 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్టు సీఎస్‌లు కాంచనమాల, పలివెల శివాజీ తెలిపారు.

తునిలో 120 మంది గైర్హాజరు

తుని: పట్టణంలో ఏర్పాటు చేసిన సెంటర్లలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు పటిష్ఠ బందోబస్తు మధ్య ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తునిలో వివేకా జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సిద్ధార్థ, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఎస్వీ జూనియర్ కళాశాల, వైష్ణవి జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు సెంటర్లలో తెలుగు, సంస్కృతం పరీక్షకు 120 మంది విద్యార్థులు హాజరు కాలేదు. మొత్తం 2,888 మందికి 2768 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద ప్రాథమిక చికిత్స సెంటర్లను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలు ఉన్న ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేశామని పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపారు.

ప్రత్తిపాడులో ఎనిమిది మంది గైర్హాజరు

ప్రత్తిపాడు: స్థానిక మినర్వా జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు, సంస్కృతం పరీక్షకు 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 427 మంది విద్యార్థులకు గాను 419 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి వి. రాజబాబు తెలిపారు.

గోకవరం: ఇంటర్మీడియెట్ పరీక్షలు గోకవరంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, బీఎస్ఆర్ జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 55 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 477 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 422 మంది హాజరైనట్టు చీఫ్ ఎగ్జామినర్ తోట శ్రీనివాస్ తెలిపారు. బీఎస్ఆర్ జూనియర్ కళాశాలలో 15 మంది గైర్హాజరయ్యారు. 329 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 314 మంది హాజరైనట్టు పరీక్షల చీఫ్ ఎగ్జామినర్ కేవీ రామకృష్ణ తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని సిట్టింగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఆకతాయిల ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఇనుప కంచె ఏర్పాటు చేశారు.

శంఖవరం: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక ఆదర్శ పాఠశాల, కత్తిపూడి సీతారామా కళాశాల్లో పరీక్షలు నిర్వహించారు. ఆదర్శ పాఠశాల్లో 303 మంది విద్యార్థులకు గాను 290 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటిండెంట్ కె.కృష్ణవేణి తెలిపారు. సీతారామా కళాశాల్లో 290 మంది విద్యార్థులకు గాను 274 మంది హాజరు కాగా 16 మంది గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటిండెంట్ అరుణాకుమారి తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద అన్నవరం ఎస్సై హరిబాబు బందోబస్తు నిర్వహించారు.

రౌతులపూడి: ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ కేంద్రంలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 260 మంది హాజరుకావలసి ఉండగా 252 మంది హాజరయ్యారు. ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ విజయ్‌బాబు తెలిపారు. వీరి కోసం ఎనిమిది తరగతులను కేటాయించి 10 మంది ఇన్విజిలేటర్లు, డీఎస్, ముఖ్య పరీక్షల నిర్వహణాధికారులను నియమించినట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సత్రం భూములకు బహిరంగ వేలం నిర్వహించాలి

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో సత్రం భూములకు బహిరంగ వేలం నిర్వహించాలని రైతులు దేవదాయశాఖ అధికారులను కోరారు. జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలోని పానుగంటి లక్ష్మి వెంకయమ్మ (పీఎల్‌వీ) ధర్మ సత్రానికి 17 ఎకరాల భూమి మండలంలోని తాళ్లూరులో ఉంది. ఈ భూమిని దేవదాయశాఖ నిబంధనలకు విరుద్ధంగా, రైతులకు ఎటువంటి సమాచారం లేకుండా అధికారులు కౌలుకు ఇచ్చేశారని తాళ్లూరుకు చెందిన పాలచర్ల అజిత్ కుమార్, మలిరెడ్డి నల్లదొర, పైన్ని సూరిబాబు ఆరోపించారు. దీనిపై ఈఓ రాంబాబురెడ్డిని అడిగేందుకు ప్రయత్నం చేసినప్పటికీ ఈఓ ముఖం చాటేయడం, సమాధానం దాటవేశారన్నారు. ఈఓ సత్రంలో ఉన్నట్టు తెలుసుకుని అక్కడకు వెళ్లి వేలం వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేయగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. తాము విషయం చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ పట్టించుకోకుండా ఆఫీస్‌లోకి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై దేవదాయశాఖ ఉన్నతాధికారులను వివరణ కోరగా రికార్డులు పరిశీలించి తగు చర్యలు చేపడతామని తెలిపారు.

ప్రగతిలో గెస్ట్ లెక్చర్



అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఉపాధ్యాయులు

గండేపల్లి: సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో మెషీన్ లెర్నింగ్ మోడల్స్ ఫర్ డేటా సైన్స్ అప్లికేషన్స్‌పై విద్యార్థులకు గెస్ట్ లెక్చర్ నిర్వహించినట్టు కళాశాల చైర్మన్ పి. కృష్ణారావు తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూకే అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్ఎస్ఎస్ఎన్ ఉషాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశ్రమలలో డేటా సైన్స్‌లో మెషీన్ లెర్నింగ్ ప్రాముఖ్యతను వివరించారు. వివిధ మోడల్స్, వాటి ఉపయోగాలను ఉపాధ్యాయులు, విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, ప్రిన్సిపాల్ జి.నరేష్, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, అకడమిక్స్ డైరెక్టర్ కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

తుని: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ తుని నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. యూత్ విభాగం అధ్యక్షుడిగా మడెపల్లి రాజుబాబు, మహిళా విభాగానికి అంగులూరి సుశీలరాణి, రైతు విభాగం అన్నంరెడ్డి వీర్రాఘవులు, బీసీ సెల్ పెండ్యాల రామకృష్ణ, ఎస్సీ సెల్ లంక కృపానందం, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా గొంప గంగామహేష్‌లను నియమించారు. మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా షేక్ ముస్తఫా, క్రిస్టియన్ మైనారిటీ సెల్ వద్దాది ఏసుబాబు, విద్యార్థి విభాగం యల్లపు జగదీష్‌మధుబాబు, పంచాయతీరాజ్ విభాగం అకంరెడ్డి నాగరాజు, మున్సిపల్ విభాగం కాసె కఫీల్, ఆర్టీఐ విభాగం గుద్దంటి అప్పలరావు, వలంటీర్ల విభాగం సరస్వతీరాజుబాబు, గ్రీవెన్స్ సెల్ పెద్దపూడి శ్రీను, వాణిజ్య విభాగం వెలగా వెంకటకృష్ణాజీ, చేనేత విభాగం అధ్యక్షుడిగా బండారు నాగేశ్వరరావులను ఎంపిక చేశారు. వైఎస్సార్ టీయూసీకి అనిశెట్టి నాగిరెడ్డి, అంగన్వాడీ విభాగం కాళ్ల కామేశ్వరి, లీగల్ సెల్ అటక వెంకటరవిచంద్, కల్చరల్ వింగ్ మురాలశెట్టి సత్యనారాయణమూర్తి, సోషల్‌మీడియా విభాగం లెక్కల భాస్కరరావు, ఐటీ విభాగం చింతకాయల శివాజీ, దివ్యాంగుల విభాగం కిలతాడ రవి, డాక్టర్ల విభాగం కాపవరపు సత్యన్నారాయణ, ఇంటిలెక్చువల్ ఫోరం సిద్దా శ్రీనివాసరావు, బూత్ కమిటీ విభాగం తమరాన శ్రీనివాసరావు, పబ్లిసిటీ వింగ్‌కు బుద్ది బుజ్జియ్యలను నియమించారు. తమ నియామకాలకు కృషి చేసిన మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజాకు నూతన అధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం



ఒమ్మంగిలో పార్టీ నేతలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో శనివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పర్యటించారు. గ్రామంలో పార్టీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులి రామకృష్ణ, ఎంపీటీసీ సాధనాల అప్పారావు, పార్టీ నాయకులు కొప్పన గంగరావు, చీమల శ్రీనివాస్, కొప్పన వెంకన్నబాబు, కొప్పన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్నబ్బాయి మృతి పార్టీకి తీరని లోటు



ఎస్.పైడిపాలలో చిన్నబ్బాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముద్రగడ గిరిబాబు, పార్టీశ్రేణులు

రౌతులపూడి: ఎస్.పైడిపాలకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయుకుడు రాయి చిన్నబ్బాయి మృతి పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. ఎస్.పైడిపాలలోని చిన్నబ్బాయి స్వగృహంలో శనివారం జరిగిన శ్రద్ధాంజలి కార్యక్రమానికి పార్టీ శ్రేణులతో కలసి ఆయన హాజరయ్యారు. తొలుత చిన్నబ్బాయి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన కుమారులు రాయి ప్రసాద్, రాజు కుటంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వాసిరెడ్డి జమీలు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయి, వాసిరెడ్డి భాస్కరబాబు, పార్టీ మండల కన్వీనర్ సీహెచ్‌వీవీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కాకి నాని, అంకంరెడ్డి సతీష్, చెన్నాడ సత్తిబాబు, సోమరౌతు తిరుమల వెంకన్న దొర, గొల్లు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో మృతుడి కుటుంబాన్ని శనివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. గ్రామానికి చెందిన తూము రమణ మహాశివరాత్రి పుణ్యస్నానాలకు పట్టిసీమ వెళుతుండగా కొవ్వూరు వద్ద ఆటో బోల్తా పడి మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని గిరిబాబు పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, పార్టీ నాయకులు ఒమ్మి రమణ, సారిపల్లి గంగరాజు, కోన గోవింద్, మర్రోతు బాబ్జి, నారిపిరెడ్డి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు చర్యలు



అల్లిపూడి కేజీబీవీలో సిబ్బందితో చర్చిస్తున్న ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: మహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఇటీవల మహిళలపై అఘాయిత్యాలు పెరుపోతున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అల్లిపూడి కేజీబీవీ పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి అక్కడ రక్షణ ఏర్పాట్లపై ఎస్‌ఓ రాజేశ్వరితో చర్చించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పాఠశాల లోపల, బయట ఎక్కువ వెలుగునిచ్చే విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాలను అమర్చాలని సూచించారు. పగలు, రాత్రి మహిళా సెక్యూరిటీ ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హాస్టల్‌కు వచ్చేవారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎమర్జెన్సీ నంబర్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు.

అండర్ పాస్ ఏర్పాటు చేయాలని వినతి

ప్రత్తిపాడు రూరల్: జాతీయ రహదారిపై మండలంలోని ధర్మవరం వద్ద విద్యార్థులు, ప్రజల సౌకర్యార్థం అండర్ పాస్ ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊటా వీరబాబు, ఉపాధ్యక్షుడు నానిపల్లి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు డైరెక్టర్ డి.సురేంద్రనాథ్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మవరంలో హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థులకు, జగనన్న కాలనీవాసులకు హైవేపై రక్షణ లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం విద్యార్థులు స్కూల్‌కు వెళ్లి, వచ్చే సమయాల్లో పోలీసు సిబ్బంది రక్షణ కల్పిస్తున్నారన్నారు. ఇక్కడ అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే జాతీయ రహదారిపై ధర్మవరం హైస్కూల్ జంక్షన్, వెల్దుర్తి జంక్షన్, సత్తెమ్మతల్లి గుడి జంక్షన్లలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.



హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ సురేంద్రనాథ్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

విజన్ 2047 పట్ల అవగాహన అవసరం



సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ భగవాన్ నారాయణ

తొండంగి: ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి నేపథ్యంలో విద్యార్థులకు హైడ్రోజన్ గ్రీన్ ఎనర్జీతో పాటు విజన్ 2047 పట్ల అవగాహన అవసరమని న్యూఢిల్లీ జాతీయ ల్యాబొరేటరీ మాజీ శాస్త్రవేత్త, ప్రొఫెసర్ జి.భగవాన్ నారాయణ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెరుమాళ్లపురం డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచ దేశాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. రామన్ ఎఫెక్ట్ భారత సైన్స్ చరిత్రలో మైలురాయి అన్నారు. విజన్ 2047 లక్ష్యాలపై అవగాహన కల్పించారు. రామన్ ఎఫెక్ట్ ఫలితాలు, అనువర్తనాలు, భౌతిక శాస్త్రంలో అనువర్తనాలు, సంప్రదాయేతర హైడ్రోజన్ గ్రీన్ ఎనర్జీగా భవిష్యత్తులో విద్యుత్ కొరతను ఏవిధంగా ఎదుర్కోవాలి అన్న అంశంపై విపులంగా వివరించారు. పర్యావరణ పరిరక్షణపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం ఆయనను కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీకే మెహర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రత్తిపాడు: స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో వార్షిక, విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట విద్యుత్ శాఖ ఈఈ బి.వీరభద్రరావు శనివారం తెలిపారు. ప్రత్తిపాడు మండలంలోని ప్రత్తిపాడు, టి.రాయవరం, ధర్మవరం, రాచపల్లి, ఒమ్మంగి, ఏలూరు, కిర్లంపూడి మండలంలో సింహాద్రిపురం, జగపతినగరం, కిర్లంపూడి, చిల్లంగి, ఏలేశ్వరం మండలంలోని పాత యర్రవరం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 వరకూ విద్యుత్ సరఫరాను ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

పేదల బడ్జెట్ కాదు పెద్దల బడ్జెట్

- వైఎస్సార్ సీపీ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు రఘురాం



ఒమ్మి రఘురాం

జగ్గంపేట: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల బడ్జెట్ కాదని ఇది పెద్దల బడ్జెట్ అని వైఎస్సార్ సీపీ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు ఒమ్మి రఘురాం అన్నారు. జగ్గంపేటలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రూ.3.22 లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.1.03 లక్షల కోట్లు అప్పుగా చూపడం బడ్జెట్‌లో డొల్లతనాన్ని తేటతెల్లం చేస్తోందన్నారు. బడ్జెట్‌లో ప్రకటించిన సంక్షేమం అంతా కలిపి 1.03 కోట్లు ఉందా ? అని ప్రశ్నించారు. రాష్ట్ర రెవెన్యూ రూ.2.17 లక్షల కోట్లు అని ప్రకటించిన ప్రభుత్వం ఆ సృష్టించిన సంపదను ఎవరికి ఖర్చు చేస్తోందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో రాష్ట్రం అప్పులు పాలైందని గగ్గోలు పెట్టి చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా ఒకే సంవత్సరంలో రూ.లక్షల కోట్లు అప్పు చేయడం కూటమి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. విజనరీ అని ప్రకటించుకునే మోసకారి చంద్రబాబుకే ప్రజలను నయవంచన చేయడం చెల్లిందన్నారు. పథకాల అమలులో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటో రెండో పథకాలకు అరకొర నిధులు కేటాయించి గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగులకు భృతి, మహిళలకు ఉచిత బస్సు ఇలా కూటమి ఇచ్చిన హామీలు గాలిలో కలిసిపోతున్నాయని ఆరోపించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూటమిలో భాగస్వామికావడంతో ఇచ్చిన హామీల గురించి ప్రశ్నించే పరిస్థితిలో లేరని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ పేదల పక్షాన పోరాడుతుందని చెప్పారు.

సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి



భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకుంటున్న నాగేంద్ర చౌదరి

గండేపల్లి: సనాతనధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండలంలోని తాళ్లూరు జీయ్యన్న మఠాధిపతి, భారతీయ ధర్మ పరిషత్ జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు పాడుగు ప్రసాద్ శనివారం తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సనాతన ధర్మ రక్షణ, హింధూ ధర్మ పరిరక్షణ కోసం పాటు పడుతున్న గండేపల్లి గ్రామానికి చెందిన పాలచర్ల నాగేంద్ర చౌదరిని భారతీయ ధర్మ పరిషత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడిగా నియమించినట్టు తెలిపారు. భారతీయ ధర్మ పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీకృష్ణ శరణానందభారతీ చేతుల మీదుగా ఆయనకు నియామక పత్రం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్, పలువురు నేతలు నాగేంద్రకు శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసు విధులపై అవగాహన కలిగి ఉండాలి



జయహో మహిళా ప్రతిజ్ఞ చేస్తున్న సీఐ వైఆర్‌కే, సీడీపీఓ పూర్ణిమ, విద్యార్థినులు

గోకవరం: విద్యార్థినులు పోలీస్ విధులపై అవగాహన కలిగి ఉండాలని నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గోకవరం పోలీస్‌స్టేషన్‌లో శనివారం వసతి గృహ విద్యార్థినులకు, స్థానిక మహిళలకు ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో రిసెప్షన్, మహిళా రక్షక్, డయల్ 112, ఎఫ్ఐఆర్, లాకప్, వీహెచ్ఎఫ్ కమ్యూనికేషన్ సెట్, పోక్సో కేసులు, ఆర్‌టీఐ యాక్టు, డ్రగ్స్ నివారణ వంటి అంశాలపై విద్యార్థినులకు కోరుకొండ సీఐ వై.సత్యకిశోర్, గోకవరం ఎస్సై పవన్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ వసతి గృహాలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'జయహో మహిళ'

జగ్గంపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో రాజపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జయహో మహిళ కార్యక్రమం నిర్వహించారు. జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను, మహిళల సంరక్షణ చట్టాలను వివరించారు. మార్చి 1న పుట్టిన బాలబాలికలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించి వారి పేరున అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మహిళలు, బాలికలు రక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రాజపూడి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎ.ధర్మరాజు, అంగన్ వాడీ సూపర్ వైజర్ అమ్మాజీ, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.